క్లుప్తంగా

శివపార్వతులకు క్షీరాభిషేకం



శివపార్వతుల జోడు లింగాలకు క్షీరాభిషేకం చేసిన దృశ్యం

కూడేరు: కూడేరులో ప్రఖ్యాతిగాంచిన శివ పార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జోడు లింగాలకు విశేష పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు జోడు లింగాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పుష్పాలతో జోడు లింగాలను ఆకర్షణీయంగా అలంకరణ చేశారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రాయదుర్గంటౌన్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున అన్నారు. సోమవారం రాష్ట్ర విభజన అనంతరం విభజన హామీలు, ప్రత్యేక హోదా అమలు, తదితర అంశాలపై సీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక హోదా సాధించుకునే దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కూటమిలో బీజేపీ భాగస్వామ్యం ఉన్నందున, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హోదా సాధించాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గురుస్వామి, నరసింహులు, ఏఐవైఎఫ్ నాయకులు కుమార్, కొట్రేష, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా వసతి గృహం



బాలుర వసతి గృహంలో పచ్చగా కళకళలాడుతున్న చెట్లు

కూడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో పచ్చదనం పరుచుకుంది. వసతి గృహం వార్డెన్ గురు ప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో చెట్లను సంరక్షిస్తున్నారు. చెట్లకు పాదులు చేయించి, నీరు పెట్టించడంతో పచ్చగా ఏపుగా పెరుగుతున్నాయి. మరోవైపు వసతి గృహం ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉంది. వేసవి సెలవులు ముగియడంతో ఈ నెల 13న వసతి గృహాన్ని ప్రారంభించారు. వసతి గృహం గ్రామం మధ్యలో అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారి పక్కనే ఉంది. చెట్లు ఏపుగా పెరిగి పచ్చగా ఉండడంతో ఆహ్లాదకరంగా ఉంటోంది.

నేడు పశువైద్య శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని పాపంపల్లిలో ఉచిత గొడ్డుమోతు పశువైద్య శిబిరం మంగళవారం నిర్వహిస్తున్నట్లు కళ్యాణదుర్గం సంచాలకులు శ్రీనివాసుగుప్త తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో గొడ్డుమోతు, చూడి పరీక్షలు నిర్వహించి, మందులు సరఫరా చేస్తామన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



మృతిచెందిన కురుబ ఎర్రిస్వామి

బెళుగుప్ప: మండల పరిధిలోని కాలువపల్లికి చెందిన కురుబ ఎర్రిస్వామి (30) అప్పుల బాధతో పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కాలువపల్లి గ్రామంలో కురుబ ఎర్రిస్వామి టీస్టాల్ నిర్వహించేవాడు. తనకున్న ఐదెకరాల పొలంలో బోరుబావులు తవ్వించాడు. కర్బుజా, టమాట, పంటలతో పాటు గతేడాది బాడిగ మిర్చి సాగు చేశాడు. మరో ఐదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేశాడు. రూ.25 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటల దిగుబడి లేక, అప్పులు తీర్చే మార్గంలేక కొన్నాళ్లుగా మదన పడుతుండేవాడు. సోమవారం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి తల్లి లక్ష్మిదేవి, భార్య ప్రియాంక ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



ఈద్ ముబారక్ తెలుపుకుంటున్న చిన్నారులు



ఉరవకొండలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న వేలాది మంది ముస్లింలు



రాయదుర్గంలోని బళ్లారి రోడ్డు ఈద్గా మైదానంలో బక్రీద్ పండుగ విశిష్టతను తెలియజేస్తున్న ఖాజీ

- ఉరవకొండ ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు
- ప్రార్థనల్లో వేలాదిగా పాల్గొన్న ముస్లింలు

ఉరవకొండ: ముస్లింలకు పవిత్రమైన, త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 9 గంటలకు ఉరవకొండ ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా ఖ్వాజీ యూనుస్ బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. ప్రవక్తలు ఇబ్రహీం ఖలీల్లులా, ఇస్మాయిల్ జవీవుల్లా వీరి త్యాగాల ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారు.. ప్రతి ఒక్కరూ ఐదు పూటలా నమాజ్, జకాత్, హజ్‌యాత్ర లాంటివి చేయాలన్నారు. ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలని ఆదేశించారు. ఇది 40 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందన్నారు. పేద, ధనికుల మధ్య తారతమ్యాలను బక్రీద్ పండుగ చెరిపేస్తుందన్నారు.

సర్వమానవాళి కోసం ప్రత్యేక దువా:

ఈ ఏడాది పంటలు పండి, ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ సర్వమానవాళి కోసం హజీ ఖతీఫ్ సాబ్ ప్రత్యేక దువా చేశారు. తాగునీరు, సాగునీరుకు ఇబ్బందులు లేకుండా అల్లాహ్ కురుణతో విస్తారంగా వర్షాలు కురవాలని దువా చేశారు.

రాయదుర్గంటౌన్: రాయదుర్గం నియోజకవర్గంలో ముస్లింలు త్యాగానికి ప్రతీక అయిన ఈదుల్ అజ్ హా (బక్రీద్) పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఖాజీసాబ్‌లు, ఇమామ్‌లు ఈదుల్ అజ్‌హా కుద్బాను సజావుగా జరిపించి, బక్రీద్ విశిష్టత, హజ్రత్ ఇబ్రహీం అలైహిస్సలాం, ఇస్మాయిల్ తాగనిరీతిని చాటిచెప్తూ, విశ్వమానవాళికి ఆదర్శమైనదిగా వివరించారు. సోమవారం ఉదయమే పట్టణంలోని బళ్లారి రోడ్డు ఈద్గా మైదానం, కణేకల్లు రోడ్డులోని ఈద్గా మైదానం, బీటీపీ రోడ్డు బైపాస్ వద్ద గల ఈద్గా మైదానం, దర్గా మసీదుల్లో ఈదుల్ అజ్ హా ప్రత్యేక నమాజ్ చేశారు. బళ్లారి రోడ్డు ఈద్గా మైదానం, కణేకల్లు రోడ్డు ఈద్గా మైదానాల్లో ప్రభుత్వ ఖాజీలు మహమ్మద్ సైపుల్లా, అతావుర్ రెహమాన్ ఈదుల్ అజ్ హా నమాజ్ చేయించారు. ఈద్ నమాజ్ అనంతరం యువకులు, పెద్దలు, పిల్లలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బక్రీద్ సంప్రదాయంలో భాగంగా ఆర్థిక స్థోమత కలిగిన ముస్లింలు పొట్టేళ్లను జబా చేసి, మాంసాన్ని పేదలు, బంధువులు, ఆత్మీయులకు పంచారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

శెట్టూరు: మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినం జరుపుకున్నారు. శెట్టూరు, లక్ష్మంపల్లి, కనుకూరు, ములకలేడు, బచ్చేహళ్లి, చెర్లోపల్లి, అయ్యగార్లపల్లి గ్రామాల్లో ముస్లింలు ఈద్గా, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక సందేశం వినిపించారు. ఇంటిల్లి పాది పండుగను ఆనందంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్‌లో..

రాయదుర్గం రూరల్: మండలంలోని ముస్లింలు త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జుంజురాంపల్లి, వేపరాల, డి.కొండాపురం గ్రామాల్లోని ఈద్గాలకు ఉదయం 8 గంటలకు చేరుకుని ఖాజీల ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలకు ఎంపీపీ విద్యావతి, జెడ్పీటీసీ హొన్నె మల్లికార్జున శుభాకాంక్షలు తెలియజేశారు.

కూడేరులో ఘనంగా బక్రీద్ వేడుకలు

కూడేరు: మండలంలో సోమవారం త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. కూడేరు, ఉదిరిపికొండ గ్రామాల్లోని మసీదుల్లో ఉదయాన్నే నియమ నిష్ఠలతో ముస్లింలు ప్రార్థనలు చేశారు. తర్వాత కూడేరులో సత్యసాయి కాలనీ వద్ద ఈద్గా మైదానానికి చేరుకొని ముస్లింలు ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కళ్యాణదుర్గం: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఎనిమిది మసీదుల మత పెద్దలు, ముస్లింలు జమాత్ టీ సర్కిల్‌లోని మదీనా మసీద్ నుంచి ఈద్గా మైదానం వరకు జమాతో వెళ్లారు. ఈద్గా ఆవరణలో ప్రత్యేక నమాజు నిర్వహించారు. అనంతరం ఆయా మసీదుల ఇమామ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బెళుగుప్పలో..

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం బక్రీద్ పండుగ జరుపుకున్నారు. మండల పరిధిలోని బెళుగుప్ప, వెంకటాద్రిపల్లి, శీర్పి, గంగవరం, శ్రీరంగాపురం, గుండ్లపల్లి, కాలువపల్లి తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద ఖ్వాజీలు పవిత్ర బక్రీద్ పండుగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గ్రామాల్లోని ఈద్గాల వద్ద ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు పోలీస్ సిబ్బందితో కలిసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

విడపనకల్లులో బక్రీద్ పండుగ

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, గడేకల్లు, వి.కొత్తకోట, విడపనకల్లు తదితర గ్రామాల్లో సోమవారం ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో బక్రీదు వేడుకలు జరుపుకున్నారు. విడపనకల్లు, పాల్తూరు, ఈద్గా మైదానంలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వి.కొత్తకోటలో బడేషావలి దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, బేలోడు, నేత్రపల్లి, భూపసముద్రం, మారెంపల్లి,గలగల,గొల్లపల్లి, గుమ్మఘట్ట, తాళ్లకెర, బీటీపీ, గోనబావి గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన వస్త్రాలను ధరించి, సామూహికంగా ఈద్గాలకు వెళ్లి అల్లాను ప్రార్థించారు. ఈ ఏడాద వర్షాలు సకాలంలో కురిసి, పంటలు పండి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అల్లాను వేడుకున్నారు. అనంతరం పేదలకు దానాలు చేశారు.

కణేకల్లు: కణేకల్లులో సోమవారం బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు ప్రతి ఒక్కరూ ఉదయం 8.30 గంటలకు ఈద్గాకు చేరుకున్నారు. నూరానీ మస్జిద్ మౌలానా మక్సూద్ ఆలమ్ పండుగ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆర్థికంగా బాగున్న ప్రతి ఒక్కరూ అల్లాహ్ పేరున పొట్టేళ్లను బలిచ్చి పేదలకు పంచాలన్నారు. అనంతరం 9 గంటలకు సామూహిక నమాజ్, దువా జరిగింది. దువా తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మాల్యం, 43ఉడేగోళం, బ్రహ్మసముద్రం, యర్రగుంట, పులచెర్లలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.

కంబదూరు: మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను సోమవారం జరుపుకున్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఈద్గ వద్ద బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ముస్లిం మత పెద్దలు ఖురాన్‌లోని సందేశాన్ని వినిపించారు. అనంతరం పేదలకు దాన ధర్మాలు చేసి, సంతోషంగా బక్రీద్ పండుగను జరుపుకున్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని బ్రహ్మసముద్రం, భైరసముద్రం, బుడిమేపల్లి, ఎరడికెర, కన్నేపల్లి తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గా మైదానాలు, మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం మత పెద్దల ఆశీర్వచనాలు తీసుకొని, ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 9 గంటలకు ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. కుందుర్పి, అప్పిలేపల్లి, జంబుగుంపల, ఎనుములదొడ్డి, తెనగల్లు, బెస్తరపల్లి, నిజవళ్లి, అల్లాపురం తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ముస్లింలు పెద్ద ఎత్తున జరుపుకున్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగను జరుపుకున్నారు. మండలంలోని బొమ్మనహాళ్, గోవిందవాడ, ఉద్దేహాళ్, కల్‌హోళ, దర్గాహొన్నూరు, ఉంతకల్లు, శ్రీధరఘట్ట, గోనేహాళ్, నేమకల్లు తదితర గ్రామాల్లో ఉదయం ఈద్గా మైదానాల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ అంటూ ఆలింగనంతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. ఖురాన్ సుక్తులు, మమ్మద్ ప్రవక్త ప్రవచనలు వినిపించారు. బక్రీద్ తాగ్యానికి ప్రతీక అని ఇబ్రహీం, ఇస్మాయిల్ ప్రవక్తలు త్యాగనిరతికి నిదర్శనమే ఈ పండగ అని అని మత పెద్దలు తెలియజేశారు.



గోవిందవాడలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎరడికెర ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



విడపనకల్లు ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శెట్టూరులో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



తాళ్లకెర గ్రామంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎనుములదొడ్డిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కంబదూరు ఈద్గ వద్ద ప్రార్థనలు చేసున్న ముస్లింలు



కణేకల్లులోని ఈద్గాలో ప్రత్యేక నమాజ్ చేస్తున్న ముస్లింలు



కళ్యాణదుర్గంలో ఈద్గా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



జుంజురాంపల్లి ఈద్గాలో ప్రార్థనలు చేయడానికి వెళ్తున్న ముస్లింలు

ఘనంగా తొలి ఏకాదశి పూజలు





అలంకార సేవల్లో మంజునాథ అన్నపూర్ణేశ్వరుడు ,స్వామి దర్శనానికి బారుల తీరిన భక్తులు

అనంతపురం కల్చరల్: విష్ణుమూర్తి యోగనిద్రకు ఉపక్రమించే పవిత్ర దినంగా భావించే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణ మంజునాథేశ్వరాలయంలో ప్రధాన అర్చకుడు బసవరాజ స్వామి ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పూజలు చేపట్టారు. ఉదయం మహా రుద్రాభిషేకం, భస్మార్చన, రుద్రం, చమకం పఠనం భక్తిశ్రద్ధలతో జరిగాయి. సోమవారం కలిసి రావడంతో తీర్థప్రసాదాలతో పాటూ అన్నదానం నిర్వహించారు. రామనగర్‌లోని భవసార క్షత్రియ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో తెల్లవారుజామున నుంచే తొలి ఏకాదశి సందర్భంగా వందల సంఖ్యలో భక్తులు బారులు తీరి దేవతా మూర్తులను దర్శించుకున్నారు. నిజపాద స్పర్శ దర్శనం ఏర్పాటు చేయడంతో భక్తులు స్వయంగా మూలవిరాట్టును తాకి పూజలు చేశారు. అలాగే ఇస్కాన్ గోశాల, వేణుగోపాల స్వామి ఆలయం, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, బాబా మందిరం తదితర చోట్ల భక్తుల సందడి నెలకొంది.

రక్తదాన శిబిరం నిర్వహించడం హర్షణీయం

అనంతపురం కల్చరల్: పరమతసహనం మన నినాదం. రక్తదానం మన విధానం కావాలి. రక్తదానం చేసే ప్రతి వ్యక్తి మరొకరి ప్రాణాలు కాపాడినట్లే అని మేయర్ వసీం సలీం కొనియాడారు. సోమవారం స్థానిక షాహీ ఈద్గా మైదానంలో బక్రీద్ పర్వదినం సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. దాదాపు 81 మంది రక్తదానం చేశారు. మేయర్ వసీంతో పాటు ఆత్మీయులుగా విచ్చేసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, మానవత రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి, కో-కన్వీనర్ సలీం మాలిక్ తదితరులు మాట్లాడారు. గత పాతికేళ్లుగా సలీం మాలిక్, నజీర్ మిత్ర బృందం బక్రీద్ రోజున వందలాదితో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటకు తెగుళ్లు



అంతరగంగలో తెగుళ్ల బారినపడిన వేరుశనగ పంట

కూడేరు: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు తెగుళ్లు సోకాయి. మండల వ్యాప్తంగా వ్యవసాయ బోరుబావుల కింద సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వేరుశనగ సాగు చేశారు. కొర్రకోడు, జల్లిపల్లి, ఉదిరిపికొండ, మరుట్ల, కూడేరు, ఇప్పేరు, కలగళ్ల, అంతరగంగ, కమ్మూరు, ఉదిరిపికొండ తండా, గొటుకూరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో వేరుశనగ పంటకు మచ్చ తెగులు సోకింది. లద్దె పురుగు, పచ్చ పురుగులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వేరుశనగ పంటలో కలుపు విపరీతంగా పెరిగింది. కలుపు తొలగించడానికి కూలీలకు రూ.వేలు ఖర్చు అవుతోంది. దీంతో ఆకులు రంధ్రాలు పడడం, మచ్చలు ఏర్పడ్డాయి. తెగుళ్ల నివారణకు రైతులు మందు పిచికారీ చేస్తున్నా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో పురుగు తగ్గుముఖం పట్టలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు, వ్యవసాయాధికారులు స్పందించి తెగుళ్ల బారిన పడిన వేరుశనగ పంటను పరిశీలించి నివారణకు తగు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కళలను ప్రోత్సహించాలి

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం లలితా కళా ఉత్సవాల ముగింపు వేడుక సందడిగా జరిగింది. స్థానిక పీస్ మెమోరియల్ హాలు వేదికగా చివరి రోజు చిత్రకళ, నృత్యకళ, సంగీతం, చదరంగం, హ్యాండ్ రైటింగ్ తదితర వాటిల్లో అపార ప్రతిభతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన పురావస్తు శాఖ ఏడీ రజిత, సీఐ జాకీర్ మాట్లాడారు. చిన్నారులను అద్భుతంగా సృజనకారులుగా తీర్చిదిద్దుతున్న చిత్రకళా మాస్టర్ వినోద్‌కుమార్ కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్ట్ మాస్టర్ అజయ్, భార్గవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి



వాల్మీకి రంగప్ప (ఫైల్)

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న బెళుగుప్ప మండలం నరసాపురానికి చెందిన వాల్మీకి రంగప్ప (52) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. కళ్యాణదుర్గం నుంచి కదిరిలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానికి వెళ్తుండగా మార్గమధ్యంలో గుండెపోటు వచ్చింది. దీంతో రంగప్ప ఆర్టీసీ బస్సులోనే గుండె పోటుతో మృతి చెందాడు. స్థానిక ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు గమనించి ఆసుపత్రికి తరలిస్తుండగా, అప్పటికే రంగప్ప మృతి చెందాడు. ఆర్టీసీ సిబ్బంది ఎవరైనా అకాల మరణం చెందితే అంత్యక్రియలకు రూ.15వేలు ఇవ్వాల్సి ఉంది. అయితే తన భర్త మృతిపై కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ నిర్లక్ష్యం చూపుతున్నారని మృతుడి భార్య శివమ్మ వాపోయింది. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.